# మహానగరం కథలు



## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కధా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

## గిల్ట్

"మేమ్! మీరా?? "అడిగాడు రాబ్ ఎదురుగా వాకర్ సహాయంతో నెమ్మదిగా నడిచి వస్తున్న మె లిండా ని చూస్తూ.

" మీరు?" గుర్తురానట్టుగా అడిగింది మెలిండా అతని వైపు తన కళ్ళ జోడులోంచి ఎగా దిగా చూస్తూ..

లూజుగా ఉన్న జీన్స్ మీద నీలపు పువ్వుల టాప్ వేసుకున్న ఆవిడ తెల్లగా పొట్టిగా ఉంది. నీలి కళ్ళు, పొట్టిగా కత్తిరించిన తెల్లని వెండి మబ్బులాంటి గిరజాల జుట్టు. తీరైన ముక్కు, నవ్వుతున్నట్టున్న పెదవులు.

కార్ లోంచి వాకర్ ని దింపుకుని నెమ్మదిగా మెడికల్ సెంటర్ వైపుకు భారంగా అడుగులు వేస్తున్న ఆమె అతన్ని పలకరింపు విని ఆగింది.

ఆయాసపడుతున్నట్టుగా వగరుస్తూ నవ్వింది. ఎర్రటి ఎండ ఆమె చెవికున్న తెల్ల రాయి దుద్దు మీద నించి ఆమె ముఖం మీద పడి మెరిసింది..

" సారీ, నేను గుర్తు పట్టలేదు, వయసయిపోయింది కదా! మీరు నాతో కలిసి ఎప్పుడైనా పనిచేశారా?"

“మీరు మెలిండా కదూ! కౌన్సిలర్? అన్నాడు చిన్న సంశయంతో.

" అవును, లిండానే" అందావిడ, నెమ్మదిగా

"కొన్నేళ్ళ క్రితం మేము మీదగ్గరకొచ్చాము" అన్నాడు అతను ఆవిడతో పాటు నడుస్తూ

"అలాగా? నేను ప్రాక్టీస్ చేసే రోజుల్లో చాలామందిని కలిశేదాన్ని కదా, అందుకే త్వరగా గుర్తు పట్టలేదు. మీరు నన్ను గుర్తుపెట్టుకున్నందుకు, పలకరించినందుకు చాలా సంతోషం" అందావిడ అతి నెమ్మదిగా నడుస్తూ..

అప్పటికి స్ఫురించినవాడిలా అతను " అరే! ఆగండి. నేను వీల్ చెయిర్ తెస్తాను, మా దగ్గర ఈ మధ్య అధునాతనమైనవి వచ్చాయి, మీకు చాలా సౌకర్యంగా ఉంటుంది" అంటూ పరిగెత్తాడు ఆవిడ ఏదో చెప్పబోతున్నా వినకుండా.

మరో నాలుగు నిమిషాల్లో వచ్చాడు అతను కొత్తగా మెరుస్తున్న వీల్ చెయిర్ తో. ఆవిడ చేతిలోని వాకర్ తీసి పక్కగా పెట్టి ఆమెని వీల్ చెయిర్ లో కూర్చోబెట్టాడు.

" దీనికి మోటార్ ఉన్నట్టుంది కదా! నేను వెళ్ళగలను, మీకు పని ఉంటుంది కదా" అంది లిండా మొహమాటంగా, హాస్పటల్ దుస్తుల్లో ఉన్న అతన్ని చూస్తూ.

" అయ్యో, పరవాలేదు మేమ్! నాకు బ్రేక్ టైం ఉంది ఇప్పుడు" అన్నాడు నెమ్మదిగా చెయిర్ని తోస్తూ ఆవిడ చేతి బేగ్ ని కుర్చీ కి తగిలించి ఆవిడ చేతిలో చిన్న నీళ్ళ సీసా, కాగితపు నేప్కిన్ ఉంచుతూ.

ఆవిడ మంచినీళ్ళు తాగి ముఖం తుడుచుకున్నాకా..

" చెప్పండి. ఏం పరీక్షలకోసం వచ్చారు? ఏ వైపుకు వెళ్ళాలి?" అని అడిగాడు. ఆవిడ చెప్పిన మాటలు శ్రద్ధగా విని అటువైపుగా కుర్చీని నడిపాడు..

రాబర్ట్ కి దాదాపు నలభై ఐదు సంవత్సరాలుండచ్చు.ఎత్తుగా బలంగా ఉంటాడు. విశాలమైన నుదురు, కొనతేలిన ముక్కు, చిన్న ఆకుపచ్చటి కళ్ళు.

" మీరు లీజా భర్త కదూ!" లిండా గుర్తుచేసుకున్నట్టుగా అంది..

" యెస్, గుర్తు పట్టారు కదా!" అన్నాడు.

" మీరు ఇక్కడ? డాక్టర్ కాదుగా?”

" కాదు, ఈ మధ్యనే ఇక్కడ చేరాను సూపర్వైజర్ గా. పార్ట్ టైం అనుకోండి" అన్నాడు

" అలాగా? లీజా ఎలా ఉన్నారు?" అడిగింది లిండా..

" లీజా!!" అంటూ ఆగాడు ఒక్క క్షణం..

---

చెప్పండి మీ సమస్య ఏమిటి? అడిగింది లిండా తన ఎదురుగా కూర్చున్న దంపతులని చూస్తూ.. ముప్పైల్లో ఉంటారు వారిద్దరూ..

ఆవిడ తెల్లగా, సన్నగా బొమ్మలా ఉంది.

అతను ఎత్తుగా హుందాగా, అందంగా ఉన్నాడు.

ఇద్దరిమధ్యా చెప్పకుండానే కనిపిస్తున్న ప్రేమ.

ఒక రిలేషన్షిప్ కౌన్సిలర్ గా లిండా తనదగ్గరకొచ్చేవారిని త్వరగా, సులభంగా అంచనా వెయ్యగలదు.

‘ వీరిద్దరూ అందంగా, ఆనందం గా ఉన్నారు, సమస్య ఏమయిఉండవచ్చు? ‘అనుకుందో క్షణం సేపు.

అదే మాట వారితో అంటూ..” నాతో ఏం పని? చెప్పండి !” అంది నవ్వుతూ..

" నాకేమీ లేదు మేం, ఇదంతా రాబ్ పని" అంది లీజ నవ్వుతూ.. ఆమెతో పాటు నవ్వుతున్న ఆమె తేనె కళ్ళు.

" ఓ లిజ్.. అదంతా నీ మంచితనం" అన్నాడు రాబ్. అతనామాట అనగానే ఇద్దరూ చేతులు కలుపుకున్నారు.

ఇద్దరినీ ఆశ్చర్యంగా చూసింది మెలిండా.

"నైస్, ఇప్పుడు విషయమేమిటో చెప్పండి" అంది తనే.

"నా పేరు రాబ్, తను లిజా, ఎలిజబెత్ నా భార్య.. నేనెంతో మంచి భర్తగా ఉండాలనుకుంటాను కానీ ఉండలేకపోతున్నానని అనుమానం. తను చాలా మంచిది, ఎప్పుడూ చెప్పదు కానీ తను బాధ పడుతోంది అని నా అభిప్రాయం" అని అతను చెప్తూ ఉండగానే

" ప్లీజ్ రాబ్! నాకేమీ లేదు, ఐ యాం హాపీ విత్ యూ అండ్ అవర్ లైఫ్. నువ్వు, నా ఉద్యోగం, నా హాబీ. నాకు చాలా హాయిగా ఉంది. ఎన్ని సార్లు చెప్పాను నీకు?" అంది లీజ. ఆమె గొంతులో ఎంతో అనునయం, శాంతం తప్ప లీలా మాత్రంగానైనా మరే భావమూ లేదు..

“సరే? మీరిద్దరూ నా మాట వినండి. కాసే మీ ఇద్దరితోనూ విడి విడిగా మాట్లాడతాను!” అంది మెలిండా.

ఆ తర్వాత రాబర్ట్ చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయింది మెలిండా. ఇలాంటివాళ్ళు కూడా ఉంటారా? ఇంత సున్నితంగా ఆలోచిస్తారా? అనిపించింది ఆమెకి.

“అవును మేమ్! నా ఉద్యోగరీత్యా నేను చాలా రోజులపాటు టూర్ల మీద ఉండవలసి వస్తుంది.దానితో నా మనసంతా తట్టుకోలేని బాధ. తను ఒక్కర్తే ఉంటుందనీ, తనకి కావలసినంత టైము నేను ఇవ్వలేకపోతున్నానని చాలా గిల్టీగా ఉంటుంది. నేనెక్కడున్నా తన మీదే నా ధ్యాస ఉంటుంది. ఒక్కర్తే ఏంచేస్తోందో? నేను పట్టించుకోలేదని ఎంత బాధ పడుతోందో? అని నాకు ఎప్పుడూ దిగులుగా ఉంటుంద. నేను చాలాకాలం ఒక్కడినే పెరిగాను, అందుకే ఒంటరితనంలోని బాధ ఏమిటో నాకు తెలుసు. నామీద ప్రేమతో చెప్పదు కానీ లీజాని నేను సరిగా చూసుకోలేకపోతున్నాని నాకు చాలా గిల్టీగా ఉంటుంది. నావరకూ నాకు ఒక్కడినే ఉండాలంటే తగని బాధ, నాదైన కుటుంబం ఉండాలని నా ఆశ” అంటూ దాదాపు ఐదు నిమిషాలు చెప్పాడు.

“మీకెందుకు అలా అనిపించాలి? ఆవిడ బాగానే ఉందిగా? “ అంది మెలిండా ఆశ్చర్యంగా.

" పైకేమీ అనదు అని నా అనుమానం" అంటూ చాలా సేపు బాధ పడిన అతన్ని ఆశ్చర్యంగా చూసి. సరే, నేను తనతో మాట్లాడి మీకు చెప్తాను" అంది చిరునవ్వుతో.

ఆ తర్వాత లీజా తో మాట్లాడింది ఆవిడ.

" రాబ్ ప్రవర్తన కొత్త కాదు మేమ్! మా పెళ్ళి అయినప్పటినించీ చూస్తున్నదే.

అతనికి నేనంటే ఎంతో ప్రేమ. ఆ ప్రేమలోనే నేనేం చెప్పినా వినిపించుకోడు. నేను నర్సరీ టీచర్ గా ఉద్యోగం చేస్తాను. చిన్న పిల్ల లతో గడపడం నాకెంతో ఇష్టం. అలాగే నేను కొద్దిగా పేరున్న చిత్రకారిణిని కూడా. పాటలు వింటూ బొమ్మలు వేసుకుంటూ ఉంటే నాకు కాలం ఎలా కరిగిపోతుందో కూడా తెలీదు. అలాగని నేను రాబ్ ని మిస్ అవనని కాదు, తప్పకుండా అవుతాను.

ప్రతీ స్త్రీ లాగే నా భర్త ఎప్పుడూ నా దగ్గరే ఉండాలని కోరుకుంటాను, కానీ అన్ని వేళలా సాధ్యమయ్యే పనేనా అది? మీరు చెప్పండి. అదే మాట తనతో అంటే ఏదో అంటాడు. గట్టిగా అంటే అతనిమీద నాకు ప్రేమ లేదనుకునతే ప్రమాదం ఉందని నేను గట్టిగా చెప్పలేను.

తన ఉద్యోగం ఏవిటో, ఎలా ఉంటుందో తెలిసి మరీ చేసుకున్నాను, ఆ మాత్రం నేను అర్థం చేసుకోలేకపోతే ఎలా? అనుకుంటాను నేను. లేని దానిగురించి కాక మేము కలిసి ఉండే రోజులు ఆనందంగా ఉండాలని ప్రయత్నిస్తాను.అంతే! “అంది నవ్వుతూ..

ఆలోచనా విధానానికి మెలిండాకి ఎంతో ముచ్చట వేసింది.

" ఎంత బాగా చెప్పారు! మీ భర్త ఎందుకు ఇలా ఆలోచించలేకపోతున్నారు?" అంది మెలిండా ఆశ్చర్యంగా.

" తను చాలా సున్నిత మనస్కుడు, అతి నెమ్మది. తనవారెవరికీ ఎలాంటి అసౌకర్యాన్ని సహించలేడు, వాళ్ళకేదైనా బాధ కలగవచ్చన్న ఊహనే భరించలేడు. అదే అతన్ని ఇలా ఆలోచించేలా చేస్తుంది. ఇంత సున్నితంగా మగవాళ్ళు ఉంటారా? అనిపిస్తుంది" అంది లీజా.

" సున్నితంగా ఆలోచించడానికి గెండర్ తో సంబంధం ఉండదుగా లీజా! అది మనుషుల్లో ఉండే గుణాల్లో ఒకటి కదా" అంది మెలిండా తను కూడా చిరునవ్వుతో.

ఆ తర్వాత రెండు మూడు సార్లు కలిసారువాళ్ళు మెలిండాని. భర్తలు తమని పట్టించుకోవడలేదని ఫిర్యాదులు చేసే భార్యలుంటారు కానీ ఇంత చక్కగా ఆలోచించే భార్యలుంటారా? ఇలాంటి భర్తలు కూడా ఉంటారా? అనుకుంటూనే రాబ్ కి తగ్గట్టుగా నచ్చచెప్పి సమాధానపరిచింది.

లీజా సహాయంతో రాబ్ సమస్యని చాలావరకూ తీర్చింది మెలిండా.

ఇద్దరికీ దాదాపు అవే విషయాలు ఒకేసారి గుర్తొచ్చి నవ్వు వచ్చింది..

" ఇప్పుడు ఎలా ఉన్నారు మీరిద్దరు? మీ ప్రాబ్లెం సాల్వ్ అయిందా? ఉద్యోగం మార్చేసారు కదా!" అంది మెలిండా నవ్వుతూ.

అతను నవ్వు ఆపి 'ఇప్పుడు ఆ అవసరమే లేదు, లీజాయే లేదు" అన్నాడు భారంగా.

" అంటే?" అంది మెలిండా అనుమానంగా.

" అవును మేమ్!మీరు విన్నది నిజమే, మూడేళ్ళక్రితమే నన్ను వదిలేసి".. అంటూ ఆగిపోయాడు అతను..

మొదటినించి ఒంటరిగా పెరిగిన రాబ్ కి మనుషులంటే ఎంతో ప్రేమ, ఎప్పుడూ తన స్వంత వాళ్ళతో ఉండాలని కోరుకునే అతనికి, లీజా యే సర్వస్వంగా భావించే అతనికి అది ఎంత పెద్ద దెబ్బో ఆవిడ అర్థం చేసుకోగలదు..

తన వీల్ చెయిర్ తోస్తున్న అతని చేతి మీద మృదుగువుగా తడుతూ చెప్పిందావిడ..

" ఓ, నో" ఇలా జరిగి ఉండకూడదు" అంది.

" జరిగింది మేమ్! నా చేతిలో చెయ్యి ఉంచుకునే నన్ను వదిలేసి వెళ్ళిపోయింది, నేను చూస్తూ ఉండగానే" అన్నాడు రాబ్ గద్గదమైన గొంతుతో

" ఐ యాం సారీ" అంది మెలిండా నెమ్మదిగా.

"నేను కూడా ప్రస్తుతం సారీ యే ఫీల్ అవుతున్నాను మేమ్! "అన్నాడు రాబ్ హఠాత్తుగా.

"అదేమిటి? సారీ ఎందుకు? " అంది మెలిండా అర్థం కానట్టు..

"మీ టెస్ట్ లు కానీండి, తర్వాత మాట్లాడదాం!" అన్నాడు రాబ్

మరో అరగంట తర్వాత హాస్పటల్ కేఫెటీరియాలో కూర్చునారిద్దారూ..

" ఇప్పుడు చెప్పండి రాబ్, ఏమిటి విషయం?" అంది మెలిండా శాంతంగా.

" ఎలా చెప్పాలో తెలీడం లేదు, నన్ను గిల్ట్ అదే అపరాధ భావం తొలిచేసోంది" అన్నాడు రాబ్.

" ఇదే మాట అప్పుడూ అన్నారు కదా, అప్పుడు లీజా ని పట్టించుకోలేదని ఆవిడ బాధపడుతోందని మీరు భావించడం వల్ల. ఇప్పుడేమిటి?" అంది..

ఒక్క క్షణం ఆగిపోయాడు, ఏమి చెప్పలేనట్టు ఉండిపోయాడు. పెళ్ళి ఉంగరం లేని తన చేతి వైపు చూసుకుంటూ మౌనంగా ఉండిపోయాడు..

అతని చేతిని మృదువుగా స్పృశిస్తూ అంది మెలిండా..

" చెప్పండి రాబ్! ఏమిటి విషయం?" అంది...

" నేను, ఐ యాం డేటింగ్ బ్రెండా నౌ.."

" అదేం తప్పు కాదే?" అంది మెలిండా.

“నా సంగతి మీకు తెలుసుగా మేడమ్! ఏను ఒక్కడినీ ఉండలేను, ఎపుడూ నావాళ్ళైన మనుషుల మధ్య ఉండాలని కోరుకుంటాను కదా, అందుకే లీజా దూరమైన దుఖాన్ని మరిచిపోవడానికే.."

" నాకు గుర్తుంది, లీజా చెప్పిన మాటలు. అయితే సమస్యేముంది?”

“ఉంది మేడం.. నా గిల్ట్ మళ్ళీ అదే!” అన్నాడు దిగులుగా.

“గిల్టా? అదేమిటి?”

“అవును, ఈసారి మా ఇద్దరిదీ.. నేను డేట్ చేస్తున్న బ్రెండా ఎవరో కాదు లీజా బెస్ట్ ఫ్రెండ్.

లీజా పోయిన కొత్తలో బ్రెండా నాకెంతో సహాయం చేసింది. ఎమోషనల్ గా నాకెంతో సపోర్ట్ నిచ్చింది, తన నెచ్చెలి జ్ఞాపకాలనుంచి నేను వీలైనంత త్వరగా బయటపడడానికి, మళ్ళీ మామూ లు మనిషినవడానికి ఎంతో తోడ్పడింది. ఆ క్రమంలోనే మేము ఎప్పుడో ఒకరినొకరు ఇష్టపడ్డాం. ఇప్పుడా ప్రేమ బంధాన్ని పెళ్ళిగా మార్చుకోవాలని అనుకుంటున్నాం. కానీ ఇద్దరి మనసుల్లోనూ లీజాకి అన్యాయం చేస్తున్న భావన రోజు రోజుకీ పెద్దదవుతూ మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది. రెండు మూడు సార్లు పెళ్ళికి డేట్ అనుకున్నాం కానీ ఈ కారణం వల్లే వాయిదా వేసాం. ఏం చెయ్యాలో తెలీడం లేదు.. యాధృచ్చికమే అయినా మీరు కనిపించడం ఒకరకంగా అదృష్టమే నాకు. ఎవరికీ చెప్పుకోలేని నా సమస్య ఇదే" అన్నాడు అతను.

తడికళ్ళతో, నెరిసిన గడ్డంతో ఉన్న అతని ముఖంలో దైన్యం స్పష్టంగా కనిపించింది మెలిండాకి.

కాఫీ తాగుతూ ఒక్క క్షణం ఆలోచించిందావిడ.

ఆవిడ మనసులో అస్పష్టంగా మెదులుతున్న ఆలోచన. ఎదురుగా ఉన్న అతనికి ఏం చెప్పాలా?అని..

ఆ తర్వాత నెమ్మదిగా అంది..

" లీజా చాలా పాజిటివ్ గా ఉండే వ్యక్తి. తనకి మీరంటే ఎంతో ప్రేమ, భర్తనుండి విడిపోయిన తన స్నేహితురాలు తన భర్తని బాగా చూసుకోగలదన్న నమ్మకం ఆమెకి తప్పకుండా ఉంటుంది. అదే లీజా కోరుకుంటూంది కూడా. బ్రెండా ని చేసుకుంటే లీజా కి అన్యాయం చేసినట్టుగా మీరు అనుకోకండి. ఇంత సున్నితంగా ఆలోచిస్తే ఏ పనీ చెయ్యలేరు. అందుకని మీరు ఎక్కువగా ఆలోచించకుండా మిగిలిఉన్న జీవితాన్ని కోరుకున్న విధంగా జీవించండి. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్!” అంది అతని భుజం మీద తడుతూ..

●●●

Click here to share your comments on this story